శాంతి మాట్లాడలేదు. నవ్వలేక నవ్వింది. ఆ నవ్వులో ప్రాణంలేదు చచ్చిపోయిన మనిషి నవ్వినట్లు కృత్రిమంగా వుంది.

సుబ్బరాజు ఎర్రబడిన కళ్ళతో మత్తుగా చూస్తున్నాడు.

మరియమ్మ విజయగర్వముతో అతనివైపొకసారి చూసి నవ్వి వెళ్ళి పోయింది

శాంతికి అతన్ని చూస్తుంటే మనిషిలా కనిపించడములేదు. తనని కబళించడానికి వచ్చిన భక్షకిలా సంఘములో స్వైరవిహారము చేస్తున్న స్వార్థానికి ప్రతిబింబంలా....

ఆమె తల తిరిగిపోతోంది ఆమె మనసులాగే వాతావరణం గూడా వేడెక్కిపోయినట్లనిపించింది చెమటతో ఆమె శరీరము తడిసిపోయింది.

సుబ్బరాజు నెమ్మదిగా కదిలి వస్తున్నాడు.

పారిపోదామా అనుకుంది.

కాని....

ఆమె కాళ్ళు గజగజ వణికాయి.

భయముతో శరీరం కంపించిపోయింది.

పాదాలు నేలకు అంటుకుపోయినట్లు ఆమె కదలలేకపోయింది.

కొండమీదనుండి దూకే జలపాతములాగా అతను ఆమెమీద పడి కౌగలించుకున్నాడు.

ఎందుకో తొలిరేయి జ్ఞాపకం వచ్చింది.

గదిలో గుబాళిస్తున్న పరిమళం. అగరొత్తుల సువాసన, సిగ్గుతోపరవశించిపోతున్న మనసు, కాని ఇప్పుడూ....

బంగారం వాసన ముక్కుకి తాకుతోంది.

నోట్లకట్టని కౌగలించుకున్నట్లు అనుభూతి.

* * *

వంటగదినిండా స్టైయిన్‌లెస్‌స్టీల్ సామాను, వంట చేసుకోడానికి గ్యాస్‌స్టవ్, ప్రెషర్‌కుక్కరూ, వేడినీళ్ళకు రాగి బాయిలర్, పప్పురుబ్బుకో

